క్లుప్తంగా

నేల'వాలిన' ఆశలు



ఫిరంగిపురం: గడిచిన రెండురోజులుగా ఫెంగల్ తుఫాన్ కారణంగా వీస్తున్న ఈదురుగాలులకు వరి పంట నేలవాలింది. మండలంలోని పలుగ్రామాల్లో రెండువేల ఎకరాల్లో వరిపంట సాగుచేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాగా తుఫాన్ కారణంగా తీవ్రంగా ఈదురుగాలులు వీస్తుండటం, చెదురు మదురుగా వర్షాలు పడుతుండడంతో పంటచేతికొచ్చే దశలో ఉన్న వరి కొన్ని గ్రామాల్లో నేల కొరిగింది. ఇన్నాళ్లు కష్టపడి పండించిన పంట కొద్దిరోజుల్లో కోసే సమయానికి పక్కకు వాలి పోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మేడికొండూరు ఎస్సై ఖాజీబాబు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల గ్రామానికి చెందిన షేక్ షరీఫ్(45) గుంటూరులో నివాసం ఉంటున్నాడు. పెన్షన్ నిమిత్తం మేడికొండూరు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై పెదకూరపాడు వెళుతుండగా మార్గమధ్యలో సిరిపురం బాల యేసు మందిరం సమీపంలో గుంటూరు నుంచి పెదకూరపాడు వెళుతున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తతో షరీఫ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో షరీఫ్ కిందపడగా లారీ ముందు టైర్లు షరీఫ్ మీదుగా వెళ్లాయి. ప్రమాదం జరిగిన సంఘటనలోని షరీఫ్ మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నాసా కిట్‌లు పంపిణీ

తెనాలిఅర్బన్: చిన్న వయస్సు నుంచే నూతన ఆవిష్కరణపై ఆసక్తిని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నాసా స్పేస్ సొసైటీ, నాసా రీసెర్చ్ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ ప్రాజెక్టు డిజైన్ చేసేందుకు అర్హత సాధించిన గంగానమ్మ పేటలోని శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులకు సోమవారం కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాధ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులకు సోమవారం కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాధ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

తెనాలిరూరల్: మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెనాలి టూటౌన్ సీఐ రాములు నాయక్ ఆధ్వర్యంలో ఇక్కడి శ్రీచైతన్య స్కూలులో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగం, వాటి ప్రభావాలు, కేసులు వంటి వాటి గురించి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

గాంధీనగర్‌లో గ్యార్మీ పండుగ

తెనాలిరూరల్: పట్టణ నందులపేట గాంధీనగర్‌లో షేక్ షేక్ నసీమ్, తాజ్‌బాషా, మునీర్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గ్యార్మీ జెండా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిధిగా వేడుకల్లో పాల్గొ న్నారు. ఆయనతో నాలుగో వార్డు కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు భరిదాసు గౌరీ శంకర్, టీడీపీ మైనార్టీ విభబూగ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఖుద్దూస్, ఇతర నాయకులు ఉన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

రేపల్లె రూరల్: ఈ నెల 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని భవిత స్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నా రులు పోటాపోటీగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనం, స్కిప్పింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్‌లు ఎస్.అనురాధ, వి.సుకన్య, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పర్యవేక్షణ

రేపల్లెరూరల్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను రహదారులపై పడవేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు ప్రతి వార్డులో సిబ్బందిని నియమించి నిత్యం వారి పనితీరు పర్యవేక్షిస్తున్నామన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు ఉన్నారు.

స్మార్ట్‌గా ఉపాధికి గండి!

- మండలంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు
- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్లు
- ఉపాధి కోల్పోనున్న మీటర్ రీడర్లు!



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుండటంతో మీటర్ల రీడర్ల పరిస్థితి ప్రశార్థకంగా మారింది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. తమకు ఇప్పటివరకు మీటర్ రీడింగ్ జీవనాధారంగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని చోట్ల స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసేలా అడుగులు వేస్తుండటంతో తాము ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడనుందని వాపోతున్నారు.

భవిష్యత్తు ప్రశ్నార్థకం..

మండలంలోని 18 గ్రామాల్లో సుమారు 20,254 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దానికి గాను విద్యుత్ రీడింగ్ తీసేందుకు ఆరుగురు మీటరు రీడర్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతినెల 2వ తేదీనుంచి 11వ తేదీవరకు ఇంటింటికి వెళ్లి మీటర్ల రీడింగ్‌ను స్కాన్ చేసి వాడిన విద్యుత్ యూనిట్లకు బిల్లులు అందజేస్తారు. ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ఇళ్లకు సైతం త్వరలో రానుందనే సమాచారంతో మీటర్ రీడర్లు ఆందోళన చెందుతున్నారు. తమ ఉపాధికి గండిపడి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే 200 స్మార్ట్‌మీటర్లు బిగింపు..

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దుకాణాలకు ఇప్పటికే 200 పైచిలుకు స్మార్ట్‌మీటర్లు బిగించారు. స్మార్ట్‌మీటర్లు అత్యాధునిక సాంకేతికతో కూడుకున్నవి. వీటిలో మోడెంతోపాటు సిమ్‌తో కూడిన చిప్ ఏర్పాటు చేసి ఉంటుంది. ఈ మీటర్లు పోస్ట్ పెయిడ్ మోడ్‌లో ఉంటాయి. దీనిద్వారా నెలవారీ రీచార్జ్ చేసుకొనేలా మార్చుతారు. ప్రతినెల విద్యుత్ వినియోగదారుడు తమ విద్యుత్ వాడకాన్ని బట్టి రీచార్జ్ చేసుకుంటుంటారు. ఈపద్ధతి ద్వారా మీటర్ రీడర్లతో పనిలేకుండా ప్రీపెయిడ్ ఆప్షన్‌లోకి మార్చి విద్యుత్ కార్యాలయంలోనే కంప్యూటర్ ఆపరేటర్‌తో దానిని అనుసంధానించవచ్చు.

18 గ్రామాలకు ఆరుగురు రీడర్లు..



మండలంలోని 18 గ్రామాల్లో విద్యుత్ బిల్లులు ఇచ్చేందుకు ఆరుగురు మీటర్ రీడర్లు కమీషన్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఒక అవుట్ సోర్సింగ్ ఏజన్సీ ద్వారా వీరి కార్యకలాపాలు కొనసాగిస్తుంటారు. వీరికి మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో మీటర్ ఒక్కొంటికి రూ. 5.71 పైసలు చొప్పున సంస్థ చెల్లిస్తుంది.

ఉపాధి కోల్పోతాం..



ఎన్నో ఏళ్లగా మీటర్ రీడింగ్ పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో మేము ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం మా ఉద్యోగాలకు భద్రత కల్పించాలి.

– కె.రాజారత్నం, మీటర్ రీడర్

ఏడు ఏళ్లుగా పనిచేస్తున్నాను..



చదువుకున్నా సరైన ఉపాధి లేకపోవడంతో మీటర్ రీడర్‌గా ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. ఎప్పటికైనా మా ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తారనే ఆశతో ఉన్నాను. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియతో మా ఉద్యోగానికి భద్రత కరువైంది.

– మనోజ్, మీటర్ రీడర్

బేషరతుగా ధాన్యం కొనుగోలు చేయాలి



దుగ్గిరాల డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్: రైతులు పండించిన పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా తేమశాతం నిబంధనతో సంబంధం లేకుండా బేషరతుగా కొనుగోలు చేయించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల డిప్యూటీ తహసీల్దార్ దుర్గకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జూలై, ఆగష్టు నెలల్లో కురిసిన వర్షాలకు వరిపంట దిగుబడి తగ్గిందని, దానికి తోడు మద్దతు ధర గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం తగ్గిందన్నారు. గతంలో ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వస్తే ఈ ఏడాది ఎకరాకు 25 నుంచి 30 బస్తాలు మాత్రమే వచ్చాయని తెలిపారు. పంట మద్దతు ధర క్వింటాలుకు రూ.2340 ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆ విధంగా 75 కేజీల బస్తా రూ.1740 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ.1350-1400వరకు కొంటున్నారని, ఈ విధంగా రైతులు ఎకరానికి రూ.20-24 వేల వరకు నష్టపోతున్నారని అన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా దుగ్గిరాల మండలంలోని అన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ. 1740కు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో 48 గంటల్లో నగదు జమచేయాలని, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు అందించాలని కోరుతున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎన్.యోగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు నూతక్కి విద్యార్థిని



విద్యార్థిని ఉదయశ్రీతో ఉపాధ్యాయులు

మంగళగిరి: గత నెల 14వ తేదీ నుంచి 16వరకు జరిగిన అంతరాష్ట్ర వాలీబాల్ బాలికల పోటీల్లో ప్రతిభ చూపిన నూతక్కి విద్యార్థిని ఉదయశ్రీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ంది. గుంటూరు జిల్లా బాలికల పోటీలలో విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన 9వ తరగతి విద్యార్థిని ఉదయశ్రీని పీడీ రజనీనాయక్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పరిశుభ్రమైన నీటితోనే ఆరోగ్యం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు శాంతి

ఫిరంగిపురం: తాగునీరు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. 148 మందికి బీపీ, షుగరు, యూరిన్, రక్తపరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం పరిసరాల శుభ్రత, తాగునీరు, పౌష్టికాహారం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యురాలు శాంతి వివరించారు. శీతాకాలం కావడంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుందని నాలుగురోజులకు ఓమారు తాగునీరు ఉండే కుండలను శుభ్రంగా కడుగుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు సక్రమంగా పారేలా ఉండాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు లోనయ్యే ప్రమాదం ఉందన్నారు. దాని నివారణకు ఆకుకూరలు, క్యారెట్, పాలు, పప్పుధాన్యాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్ఎం ఆనందకుమారి పాల్గొన్నారు.

భూములు స్వాధీనం చేసుకున్న ఏసీసీ కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం కోసం సోమవారం మళ్లీ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ శనివారం కార్మికులు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు కూల్చివేశారని, పాకల కూల్చివేసిన స్థలాన్ని కార్మికులు తిరిగి స్వాధీనం చేసుకోవడం అభినందనీయమని అన్నారు. అధికారులు కూల్చివేసినా పోరాట శిబిరాన్ని మరల నూతనంగా ఏర్పాటు చేసుకోవడం కార్మికుల పట్టుదలకు నిదర్శమని, కోర్టు ఆదేశాలను ధిక్కరించి అధికారులు కనీస నియమ నిబంధలు పాటించడం లేదని, అక్రమంగా పేదల గుడిసెలను కూల్చడానికి ప్రతి ఒక్కరు ఖండించాలని ఆయన అన్నారు. ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కోటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ఎన్ని చేసినా కార్మికుల పోరాట స్ఫూర్తిని దెబ్బతీయలేరని, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి పూర్తి అండదండలు ఉంటాయని హామీ ఇచ్చారు. మంగళగిరి రూరల్ సీపీఎం నాయకుడు మొసలి ఫకీరయ్య దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ పూర్తి మద్దతు తెలియజేశారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, శివమ్మ, అమానుల్లా ఖాన్, ఎస్.ఆరిఫ్, వి.శాస్త్రి, ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, సాంబశివరావు, బాష, రమాదేవి, ఎం.శారద, సారమ్మ, దుర్గమ్మ, హిమాంబి, నాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇశ్రాయేలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం సుధారాణి, పూర్వ విద్యార్థులు

తెనాలిఅర్బన్: చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా దాని అభివృద్ధికి సహకరించటంతో పాటు విద్యార్థులను విద్యలో ప్రోత్సహించటం ఎంతో అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు పీవీ సుధారాణి పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీ ఆర్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో 1979-80వ సంవత్సరంలో పదోవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో 9,10 తరగతుల్లో ఫార్మేటివ్ 1,2 పరీక్షలలో మంచి మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు సోమవారం సిల్వర్ మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2012 నుంచి పూర్వ విద్యార్థులు పాఠశాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వీరిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివప్రసాద్, షేక్ నూర్జహాన్, ఎస్ఎస్ ప్రకాష్, అహ్మద్, షరీఫ్, కె శ్రీనివాసరావు, జి.పోలేరమ్మ, కె భూలక్ష్మి, జే రాజేశ్వరరావు, హనుమంతరావు, చలమయ్య, రమణబాబు, ఇబ్రా, వెంకటరెడ్డి, షేక్ కరిముల్లా, వి.వాసు, సీఆర్పీ శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఫొటోలు, వీడియోలు తీశాం...

- బకాయిలు ఇప్పించండి
- తహసీల్దార్‌కు విన్నవించిన వీడియోగ్రాఫర్లు

తెనాలిరూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి రెవెన్యూ, పోలీసుల శాఖల తరపున ఎన్నికల సంఘం కింద ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పని చేశామని, ఇప్పటికి ఏడు నెలలైనా వేతనాలు చెల్లించలేదని పలువురు వీడియోగ్రాఫర్లు సోమవారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కలిసి తమ గోడును వినిపించారు. ఎన్నికల సందర్భంగా 39 మంది వీడియోగ్రాఫర్లు కెమెరాలను పెట్టి వీడియోలు తీశామని, వాటికి సంబంధించి రూ. 24 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్‌కు తెలిపారు. ఇప్పటికే బిల్లులను ఆమోదం కోసం పంపామని, మరో రెండు వారాల్లో నిధులు విడుదలవుతాయని తహసీల్దార్ వారికి తెలిపారు. ఇక దీంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు వచ్చాయి. రీ సర్వేలో భూమి వైశాల్యం తగ్గిందని, సర్వే చేయాలని, కొపల్లె డొంక రోడ్డులోని జేఎంజే స్వధార్ హోంలోని అనాథలకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందేలా చూడాలని, కోపల్లె గుడివాడలో రైతు పొలాన్ని రోడ్డుకు తీసుకుంటున్నారని అర్జీలు వచ్చాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు.

హెచ్ఐవీపై ఫ్లాష్‌మాబ్

గుంటూరు ఎడ్యుకేషన్: హెచ్ఐవీ ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా యువతరం సమాజాన్ని ఫ్లాష్‌మాబ్‌తో చైతన్యపర్చే ప్రయత్నం చేశారు. సోమవారం జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై కళాశాల నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎయిడ్స్‌తో కలిగే అనర్థాలు, సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరిస్తూ విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ ద్వారా ప్రదర్శన ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై సమాజంలో అనేక అపోహలు ఉన్నాయని, దీని నియంత్రణకు అనేక మార్గాలను సూచిస్తూ సమాజాన్ని చైతన్య పర్చేందుకు తమ కళాశాల విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ ప్రదర్శించారని తెలిపారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి
- తాడికొండ నియోజకవర్గ ముఖ్యనేతలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో సమావేశం
- పాల్గొన్న పార్టీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

పట్నంబజారు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోందని, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే..తాము చూస్తూ ఊరుకోబోమని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు స్పష్టం చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం తాడికొండ నియోజకవర్గ ముఖ్య నేతలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్తకు అడుగులో అడుగై అన్నివేళలా వారిని కాపాడుకునేలా ఒక బలమైన జిల్లా కమిటీ నిర్మాణాన్ని ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఇప్పటికే ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ ముఖ్యనేతలతో చర్చించటం జరిగిందన్నారు. దానిలో భాగంగా గ్రామ, మండల, పట్టణ, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా యోచిస్తున్నట్లు తెలిపారు. పార్టీ జెండాను భుజాన పెట్టుకుని, ఎటువంటి కష్టనష్టాలకు వెరువకుండా ముందుకు సాగే ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత పదవుల్లో ఉంటుందన్నారు. పార్టీ గుంటూరు, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి మనోభావాలు, వారి అభిప్రాయాలకు అనుగుణంగానే పార్టీ కమిటీల నియామకం ఉంటుందని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అందరూ ఉంటారని, కానీ కష్టంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పోరాడే వాడే వైఎస్సార్ సీపీ కార్యకర్త అని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా చెప్పలేని చంద్రబాబు, అబద్ధాలను అందంగా చెప్పి.. ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించారని, వాటిపై ప్రజలు బహిరంగానే నిలదీసే పరిస్థితులు ఆరు నెలలకే వచ్చాయన్నారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ముఖ్యనేతలు, అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాటానికి వెనుకాడం

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఆయా ప్రాంతాల సమస్యలు, స్థానికంగా ఏర్పడిన రాజకీయ పర్యవసానాలపై చర్చించారు. కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్న అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా... కనీసం ప్రజలకు ఒక్క మేలు చేసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఇదేమని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులతో పార్టీ కార్యకర్తలతో పాటు, సోషల్ మీడియా యాక్టివిస్టులను కూడా భయపెట్టేందుకు ఏ మాత్రం వెనుకాడటంలేదని విమర్శించారు. ఇటువంటి కేసులకు, తాటకు చప్పుళ్లకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఒక్క అడుగు కూడా వెనక్కి వేయరన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా, ప్రజల పక్షాన ఎంతటి పోరాటినికి వెనుకాడని విధంగా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సమన్వయకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు(డైమండ్), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి

24వ వార్డులో పర్యటించిన చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో పారుదల లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, దాని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కోరారు. 24వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. మురుగు కాల్వలు అధ్వాన్నంగా ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజు కాల్వలను ఎందుకు బాగు చేయటం లేదని ప్రశ్నించారు. మురుగు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, కో ఆప్షన్ సభ్యురాలు గౌరికపూడి నిర్మలదేవి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వరరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్సిటీ అధికారులను కలిసిన వికాస నూతన కార్యవర్గం



ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వికాస నూతన కార్యవర్గ నాయకులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యాపకేతర సిబ్బంది సంఘం(వికాస) నూతన కార్యవర్గ నాయకులు సోమవారం వర్సిటీ ఉన్నతాధికారులను అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీ ఆచార్య కే గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కే రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధిలో ఉద్యోగుల సహకారం ఎల్లపుడూ ఉంటుందని వికాస నాయకులు ఉన్నతాధికారులకు పేర్కొన్నారు. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి, యూనివర్సిటీలోని జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికాస అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులు టి.వెంకటేష్, ఎన్.నాగేశ్వరరావు, కోశాధికారి కె.యేషయ్య, కార్యవర్గ సభ్యులు సీహెచ్ ఆనంద్ కుమార్, పి.నాగరాజు, సిహెచ్.సాంబశివరావు, కె.శశిధర్, జి.శ్రీను, ఎన్.శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు ఉన్నారు. వర్సిటీ విభాగాలలో స్వీట్లు పంచి వికాస ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

కార్మిక నాయకుడు అంకమ్మరావు మృతి

సంతాపం తెలిపిన సీపీఎం నాయకులు



తెనాలిఅర్బన్: ఏపీఎస్ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకులలో ఒకరైన తెనాలి నాజరుపేట వాసి పి.అంకమ్మరావు (95) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు అక్కడికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అంకమ్మరావు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్.భవన్నారాయణ, కొల్లిపర బాబుప్రసాద్, ములకా శివ సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, పి.జోనేష్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు కె.శివశంకర్, ఎస్.సుబ్రమణ్యం, డాక్టర్ సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.